ప్రజాపాలన కౌంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

జీరో బిల్లుకు దరఖాస్తు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మరికల్, జూన్ 22 : ప్రజాపాలనలో దరఖాస్తు చేసినా కూడా గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు రాని వారి కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తు, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్‌లు తీసుకొని ప్రత్యేక కౌంటర్‌లో ఆన్‌లైన్ చేయించాలని కోరారు. ఇప్పటి వరకు జీరో బిల్లులు రాని వారికి వచ్చే నెల నుంచి జీరో బిల్లు వస్తుందన్నారు. అంతకుముందు కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పావని తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జడ్చర్ల/మిడ్జిల్ జూన్ 22 : జడ్చర్ల పురపాలక సంఘం పరిధిలో గృహజ్యోతి పథకం కింద కరెంట్ జీరో బిల్లు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ రాని వినియోగదారులు వివరాలను మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కమిషనర్ రాజయ్య తెలిపారు. శనివారం జడ్చర్ల మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రేషన్ కార్డు జిరాక్స్, కరంట్ బిల్, ఆధార్‌కార్డు, గ్యాస్‌బుక్, ఫోన్‌నెంబర్ వివరాలతో నమోదు చేయించుకోవాలని సూచించారు. మిడ్జిల్ మండలంలో గృహజ్యోతి పథకంలో విద్యుత్ జీరో బిల్లు అమలు కాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏఈ జ్ఞానసుందర్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తెల్లరేషన్ కార్డుదారులే అర్హులుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 200 యూనిట్లులోపు విద్యుత్ వాడేవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. దరఖాస్తులను ఎంపీడీవో కార్యలయంలో అందించాలని సూచించారు.

దరఖాస్తుల్లో సవరణ చేసుకోవాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తుల్లో సవరణలను ప్రజాపాలన సేవా కేంద్రంలో చేసుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణవాసులకు మున్సిపలిటీలో, గ్రామీణ ప్రాంతాలవారికి ఎంపిడీవో కార్యాలయా ల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి ఆధార్, రేషన్, గ్యాస్ సిలిండర్ వివరాలను విద్యుత్‌బిల్, రసీదులు సమర్పించి దరఖాస్తులో సవరణలు చేసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా ఏరువాక వేడుక

- ఎడ్లలను అలంకరించి పూజలు చేసిన రైతులు
- పలు చోట్లా బండ్లతో ర్యాలీలు

కౌకుంట్లలో ఏరువాక సందర్భంగా ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూన్ 22 : చిన్న చింతకుంట, కౌకుంట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఏరువాక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా రైతులు తమ ఎడ్లలను అందంగా అలంకరించారు. సాయంకాలం రైతులు ఎడ్లల బండ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్లలబండ్లతో ఊరేగింపుగా ఏరువాక ఉత్సవాల్లో పాల్గొని ఏరుక తాడును తెంపాయి. తాడు తెంపిన రైతులకు ఆయా గ్రామాల సర్పంచులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కౌకుంట్ల గ్రామపెద్దలు ఎడ్లల బండ్లకు గంటలు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై నాగన్న ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

దేవరకద్ర మండలంలో..

దేవరకద్ర, జూన్ 22 : మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి ఉత్సవాలను రైతులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన అనంతరం పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించి ఏరుకతాడును తెంపించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్, జూన్ 22 : మండలంలోని పోతులమడుగు గ్రామంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధిలో ఎడ్లలను పరుగెత్తించి తాడు తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలో ఎల్పటి కృష్ణయ్య ఎడ్లు తాడును తెంచాయి. కార్యక్రమానికి గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హర్యానాయక్,ఆనంద్‌రెడ్డి, మన్యం, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

శాసన్‌పల్లిలో ఎడ్లను ఊరేగిస్తున్న రైతులు

నారాయణపేట మండలంలో..

నారాయణపేట రూరల్, జూన్ 22 : మండలంలోని శాసన్‌పల్లి, జాజాపూర్, భైరంకొండ, అప్పక్‌పల్లి తదితర గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమిని నిర్వహించారు. శాసన్‌పల్లిలో రైతులు వివిధ పురవీధుల గుండా ఎడ్లను ఊరేగింపు చేపట్టారు.

ధన్వాడ మండలంలో..

ధన్వాడ, జూన్ 22 : ఏరువాక పౌర్ణమిని శనివారం మండలంలోని కొండాపూర్, కిష్టాపూర్, గున్ముక్ల, గోటూర్, హన్మన్‌పల్లి, రాంకిష్టయ్యపల్లి, మందిపల్లి, మంత్రోనిపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎడ్లలను రంగులతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేపట్టా రు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎరుక తాడు కట్టి ఎడ్లలను తాడుకింద తిరిగించి తాడును తెంపడంతో కొబ్బరికాయ కోసం రైతులు పోటీ పడి సొంతం చేసుకున్నారు.

మక్తల్ మండలంలో..

మక్తల్, జూన్ 22 : ఏరువాక పౌర్ణమిని శనివారం మక్తల్ మండలంలో ఘనంగా నిర్వహించారు. కాడెద్దులను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మక్తల్ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి పడమటి ఆంజనేయస్వామి ఆలయం వరకు భారీ సంఖ్యలో ఎడ్లను ఊరేగింపు చేసి సాయంత్రం 6గంటలకు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఎడ్ల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణ మండలంలో..

కృష్ణ, జూన్ 22 : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసవన్నలను శుభ్రంగా కడిగి రంగులు పూసి ముస్తాబు చేశారు. అనంతరం పొలంలో భూమి దుక్కి దున్ని ఏరువాక ప్రారంభించారు.

బండ్ల ఊరేగింపు..

మూసాపేట(అడ్డాకుల), జూన్ 22 : మండలకేంద్రంతోపాటు, కందూరు తదితర గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కందూరు గ్రామం నుంచి ఎడ్లల బండ్లు, బైకులు పలు వాహనాలు రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి రథం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మూసాపేట మండలకేంద్రంతోపాటు మండంలోని తుంకినిపూర్, జానంపేట, నందిపేట, వేముల తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకను రైతులు వైభవంగా నిర్వహించారు. ఆలయాల వద్ద బండ్ల ప్రదక్షిణ కార్యక్రమాలు చేపట్టారు.

మొక్కజొన్న @ రూ.2,526

జడ్చర్ల, జూన్ 22 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం మొక్కజొన్నకు అత్యధికంగా క్వింటా రూ.2,526 ధర పలికింది. 81క్వింటాళ్ల మొక్కజొన్నలు అమ్మకానికి రాగా, గరిష్ఠంగా రూ.2,526 ధర పలికింది. అదేవిధంగా 45క్వింటాళ్ల ఆర్ఎర్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,389, కనిష్ఠంగా రూ.1,939, మధ్యస్తంగా రూ.2,385ధర పలికింది. 49క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.1,925ధర పలికింది.

అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగావకాశాలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ జడ్చర్ల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లము (ఓసీ -1), జీవశాస్త్రం (బీసీ ఏ-1) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఛత్రునాయక్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత పొంది జడ్చర్ల మండలానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల మహ్మదాబాద్‌లో ఎస్జీటీ (ఎస్సీ-1) పోస్టు ఖాళీ ఉందన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత పొంది మహ్మదాబాద్ మండలానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు జూలై 6వ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో

మాగనూర్, జూన్ 22 : ఈ నెల 21న మక్తల్ మినీ స్టేడియం మైదానంలో క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మాగనూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యశ్వంత్‌గౌడ్, తిరుమలేశ్ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఇన్‌చార్జి ఎంఈవో వెంకటయ్య శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కోచ్ దీప, ఉపాధ్యాయులు విశాలక్షి, శశిరేఖ పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్, జూన్ 22 : ఈనెల 29న ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బాలాజీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

విద్యార్థులకు పలకలు, పెన్నులు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ పోస్టుమాస్టర్

మూసాపేట, జూన్ 22 : మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ నరసింహశర్మ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అవుతూ తన గ్రామంలోని పేదవిద్యార్థులకు పలకలు, పెన్ను లు, కంపాక్స్ బాక్స్‌లను పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

మరికల్, జూన్ 22 : మండలంలోని ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి, బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్ఎం నాగరత్నమ్మ అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.

పశువుల సంత వేలం వాయిదా

దేవరకద్ర, జూన్ 22 : దేవరకద్ర మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహించే సంతకు శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన వేలం పాట రెండోసారి వాయిదా పడింది. ప్రతి ఏడాది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మార్చిలో నిర్వహించేవారు. కానీ ఈసారి పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సంతవేలం వాయిదా పడింది. దీంతో కోడ్ ముగియడంతో గురువారం వేలం నిర్వహించగా గొర్రెల సంత మాత్రమే వేలం పాడి బిడ్డర్ దక్కించుకున్నారు. దీంతో రెండో సారి శనివారం పశువుల సంత, తైబజార్ వేలంను అధికారులు నిర్వహించగా వేలంలో గ్రామ పంచాయతీకి సరైన ఆదాయం రాకపోవడంతో మరోసారి వాయిదా వేసినట్లు మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ తెలిపారు. తిరిగి సోమవారం వేలం నిర్వహిస్తామని వెల్లడించారు.

రోడ్లపై చెత్తను శుభ్రం చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : పట్టణంలోని ప్రధాన రహదారులపై చెత్త కనబడకుండా శుభ్రం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని గడియారం చౌరస్తా, వీరన్నపేట పలు కాలనీల్లో రోడ్ల వెంట పర్యటించి శుభ్రతను పరిశీలించారు. పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు.

మంత్రివర్గంలో బీసీలకు అవకాశమివ్వాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 10శాతం లేని అగ్రకులాలకు 50శాతం మంత్రి పదవులు ఇచ్చారని, బీసీలను తక్కువ చేసి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు.

గర్భవతి అయిన మైనర్

బాలానగర్, జూన్ 22 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) గర్భవతి అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వరుసకు బాబాయి అయిన బాలుడు(17), బాలిక(15)తో శారీరకంగా కలిశారు. దీంతో బాలిక గర్భవతి అయ్యింది. కొద్ది రోజులుగా బాలిక అనారోగ్యంతో ఉండడాన్ని గమనించిన బాలిక తల్లి హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించగా, గర్భవతిగా తేలింది. వైద్యులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి, బాలికకు, బాధ్యుడైన బాలుడికి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూత్పూర్, జూన్ 22 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అడ్డాకుల మండలంలోని కందూరు గ్రామానికి చెందిన చెన్నయ్య(40) గత సోమవారం భూత్పూర్ వైపు నుంచి కర్నూల్ వైపు స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గ మధ్యంలో గాజులపేట స్టేజీ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్/మక్తల్ జూన్ 22 : మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని శనివారం టాస్క్ ఫోర్స్, రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కేశవులుకు చెందిన షెటర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 8.60క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీటీ కాళప్ప పంచనామా అనంతరం కేశవులుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్ తెలిపారు. మక్తల్ పట్టణానికి చెందిన ఎరుకలి హన్మంతు ఇంట్లో నిల్వ ఉన్న 10క్వింటాళ్ల రేషన్ బి య్యాన్ని పట్టుకొని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఎరుకలి హన్మంతుపై కేసు నమోదు చేశామన్నారు.

సకాలంలో డబ్బులు చెల్లించాలి

వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

నారాయణపేట టౌన్, జూన్ 22 : ఉపాధిహామీ కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి చట్టంలో పనిచేసిన 15రోజుల్లో డబ్బులు చెల్లించాలని ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. 8 వారాలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొలతలకు సంబంధం లేకుండా ఉపాధి కూలీని రూ. 600 ఇవ్వాలని, సంవత్సరంలో కుటుంబానికి 200 రోజుల పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకానికి నిధులు క్రమంగా తగ్గించడం ద్వారా కేంద్రం ఉపాధిహామీ పథకాన్ని ఎత్తి వేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. అనంతరం ఈజీఎస్ హెచ్ఆర్ మేనేజర్ సర్వరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివకుమార్, మేట్‌లు ఆనంద్, దామోదర్, భాస్కర్, కతలప్ప, ఆనందమ్మ, అనిత, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Pogula Mallesh S/o Pogula Bheemappa, age 33 years, Occ: Business, R/o H.No.1-43, Chintaldinne Village, Maddur Mandal, Narayanpet Dist., **Applicant / Borrower/ Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించి నారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.
SCHEDULE OF THE PROPERTY
The residential House No.1-90, admeasuring 227.77 Sq.Yrds., situated at Chintaldinne Village, Maddur Mandal Narayanpet Dist., which is bounded as under: **East:** House of Mekala Mallappa, **West:** Road, **North:** C.C. Road, **South:** House of Sauta Anjilappa.
MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

బహిరంగ ప్రకటన
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Narsapolla Chandramma W/o Narsappa, age 48 years, Occ: Business, R/o H.No.2-4, Udmalgidda Village, Damargidda Mandal, Narayanpet Dist., **Applicant / Borrower**, Narsapolla Anand S/o Narsappa, age 23 years, Occ: Business, R/o H.No.2-4, Udmalgidda Village, Damargidda Mandal, Narayanpet Dist. **Co-Borrowers/Prop.Holders.** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించి నారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.
SCHEDULE OF THE PROPERTY
The Residential Plot No.229 admeasuring 133.33 Sq.Yrds., out of Sy.No.392 situated at Singaram Shivar, Narayanpet Dist., which is bounded as under: **East:** Plot No.230, **West:** Plot No.228, **North:** Plot No.236, **South:** 15" Wide Road.
MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

ఆలయాల్లో పూజలు

నారాయణపేట టౌన్, జూన్ 22 : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని బాపూనగర్‌లో ఉన్న చౌడేశ్వరీమాత ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆర్డీవో మధుమోహన్, తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

నారాయణపేట, జూన్ 22 : సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న 3వ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ సూచించారు. శనివారం కోర్టులో నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 8న జరిగిన లోక్ అదాలత్‌లో నిర్దేశించిన కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఇతర జిల్లాల కన్నా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఇచ్చిన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని 90శాతం వరకు రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ఉమర్, జాకియా సుల్తానా, పీపీలు బాలప్ప, సురేశ్‌కుమార్, విజయ్ భాస్కర్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బదిలీలు సర్వసాధారణం..

నర్వ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్సై బాలకృష్ణ రెండేళ్లుగా అటాచ్డ్ టూ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ఈయన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన సందర్భంగా శనివారం పట్టణంలోని కోర్టులో జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ ఏఎస్సై బాలకృష్ణను సన్మానించారు.

ఏఎస్సైని అభినందిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

కలుషిత నీరొస్తున్నా పట్టించుకోరా..?

- మండల సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సమావేశంలో మట్లాడుతున్న తాసీల్దార్ సింధూజ

ధన్వాడ, జూన్ 22 : మిషన్ భగీరథ నీటి సరఫరాలో కలుషిత నీరు వస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ధన్వాడ ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్, ఉమేశ్‌కుమార్, కిష్టాపూర్ ఎంపీటీసీ కడపయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని సీఎన్ఆర్ భవనంలో ఎంపీపీ పద్మినీ బాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కిష్టాపూర్‌లో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ చెప్పారు. పైప్‌లైన్ లీకేజీ వల్ల రెండు, మూడు రోజులుగా నీరు సరిగా రావడం లేద ని, సమస్యను పరిష్కరిస్తామని ఏఈ ఉదయ్‌కుమార్ సమాధానమిచ్చారు. కలుషిత నీరు సరఫరా అవుతుందని, రోగాలు వచ్చే అవకాశముందన్నారు. వైద్యాధికారి సమావేశాలకు ఎందుకు రావడం లేదని ఎంపీటీసీలు గోవర్ధన్ గౌడ్, ఉమేశ్‌కుమార్, సుధీర్‌కుమార్, జెడ్పీటీసీ విమలాదేవి ప్రశ్నించారు. ధన్వాడ పెద్ద చెరు వు నుంచి అనుమతి పొందిన దానికంటే ఎక్కువగా కాంట్రాక్టర్ నల్లమట్టిని తరలిస్తున్నారని, టిప్పర్లు స్పీడ్ తో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. నిత్యం 30 టిప్పర్లకు అనుమతి ఉన్నా 300 ట్రిప్పులు తరలిస్తున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభు త్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఎంపీటీసీ గోవర్ధన్‌గౌన్ అధికారులకు సూచించారు. సమావేశం లో జెడ్పీటీసీ విమాలాదేవి, తాసీల్దార్ సింధూజ, ఎం పీడీవో సాయిప్రకాశ్, ఏవో శివకుమార్, పంచాయతీ కార్యాదర్శులు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

ఎంపీపీకి పితృవియోగం

వెంకట్రామిరెడ్డి(ఫైల్)

మూసాపేట(అడ్డాకుల), జూన్ 22 : అడ్డాకుల ఎంపీపీ దోనూరు నాగార్జునరెడ్డికి శనివారం పితృవియోగం జరిగింది. మండలంలోని పోన్నకల్‌కు చెందిన దోనూరు వెంకట్రామిరెడ్డి (88) శనివారం మధ్యా హ్నం వరకు తన పనులు తాను చేసుకుంటూ ఉన్న వ్యక్తి సాయంత్రం 4 గంటల ప్రాంతం లో ఆకస్మత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అతని మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

నేడు తైబజార్ వేలం

నవాబ్‌పేట, జూన్ 22 : మండల కేంద్రంలోని తైబజార్ వేలంను ఆదివారం ఉదయం 9గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేశ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. వ్రేలం పాటలో పా ల్గొనే వారు ముందస్